ఇంజనీరింగ్ కళాశాల మంజూరు చేయాలి

నవతెలంగాణ-భిక్కనూర్

కామారెడ్డి జిల్లాకు ఇంజనీరింగ్ కళాశాలను మంజూరు చేయాలని తెలంగాణ యూనివర్సిటీ డాక్టరేట్ అసోసియేషన్ అధ్యక్షులు సంతోష్ గౌడ్ తెలిపారు. ఆదివారం మండల పరిధిలోగల దక్షిణ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాకు ఇంజనీరింగ్ కళాశాల ఎంతో అవసరమని, ప్రతి ఏడాది జిల్లా నుంచి సుమారు 5000 మంది విద్యార్థులు ఎంసెట్ పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. సీటు వచ్చిన విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, జిల్లాకు ఇంజనీరింగ్ కళాశాల మంజూరు చేయించాలని గతంలో కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌కు వినతి పత్రం అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ప్రేమ్, కళ్యాణ్, రాజకుమార్, మోహన్, కృష్ణ, మహేష్, పవన్, జీవన్, తదితరులు పాల్గొన్నారు.

అదనపు పీపీని సన్మానించిన ఏఎంసీ వైస్ చైర్మన్

నవతెలంగాణ-భిక్కనూర్



రాష్ట్ర స్థాయిలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఎంపికైన నంద రమేష్‌ను ఏఎంసీ వైస్ చైర్మన్ పురాం రాజమౌళి ఘనంగా శాలువాతో సన్మానించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

మండల కేంద్రంలో జేఎన్‌సీ కాలనీలో గల ప్రభుత్వ ప్రైమరీ పాఠశాల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. పాఠశాలలో సమస్యలు కొట్టుమిట్టాడుతున్నాయి. పాఠశాల చుట్టూ పిచ్చి మొక్కలతో నిండిపోయి ప్రమాదంగా మారింది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యలు తీర్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు

పాఠశాలపై పట్టింపేదీ..?

రుద్రూర్ ప్రైమరీ పాఠశాలలో సమస్యలు తాండవం

- చుట్టూ పిచ్చిమొక్కలతో ప్రమాదకరంగా మారిన వైనం
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు
- సమస్యలు పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రుల వేడుకోలు

నవతెలంగాణ-వర్ని(రుద్రూర్)

ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో.. 1వ తరగతి నుంచి ఆరవ తరగతి వరకు విద్యార్థులు చదువుతున్నారు. అయితే విద్యార్థులకు ఈ పాఠశాల ప్రమాదకరంగా మారింది. పాఠశాల వెనుక, ముందు భాగంగా పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో పాములు, ఇతర విష పురుగులు సంచరిస్తున్నాయని, ఏదైనా అనుకోని ఘటన జరిగితే ఎవరు బాధ్యులని విద్యార్థుల తల్లి దండ్రు లు ప్రశ్నిస్తున్నారు.

ఒకటి, రెండు వస్తే ఇంటికే.

పాఠశా లలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ వారికి ఒకటి, రెండు వస్తే మాత్రం ఇంటికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. మూత్ర శాలలు పూర్తిగా ధ్వంసమ య్యాయి. టాయిలెట్ గుంతపై కప్పు లేకపోవడంతో విద్యార్థులు ఆడుతూ వెళ్తితే మాత్రం ప్రమాదాలు సంభవించే ఆస్కారం ఉంది. మండలంలో ఉన్న పాఠశాల పరిస్థితి ఇలా ఉందని, రోజు అధికారులు, ప్రజా ప్రతినిధులు పరిశీలిస్తున్నా.. పట్టించుకొనే వారే లేరని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ప్రమాదకరంగా మరుగుదొడ్డి గుంత



పాఠశాలకు ఇరువైపులా పిచ్చిమొక్కలు



పాఠశాల పక్కన మరుగుదొడ్ల దుస్థితి

సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా అంతే..

ఉమ్మడి మండల సీపీఐ(ఎం) ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ ఈ పాఠశాలను సందర్శించి, చుట్టూ పర్యటన చేసి, విద్యాశాఖ అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లారు. అయినా అధికారులు స్పందించడం లేదు. పాఠశాలకు విద్యార్థులు రావాలంటే జంకుతున్నారని సమాచారం. దీనితో మండల వాసులు పాఠశాల పై అధికారులకు పట్టింపు లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల చుట్టూ పారిశుధ్య పనులను చేపట్టాలని, ప్రమాదకరమైన గుంతలను మూసివేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలని కోరుతున్నారు.

ఆదుకోండి సారూ..!

యూరినల్ ఇన్ఫెక్షన్‌తో ప్రాణాపాయ స్థితిలో యువకుడు

- చిల్లి గవ్వలేక అల్లాడుతున్న వైనం
- దాతల సహాయం కోసం ఎదురుచూపులు..

నవతెలంగాణ-బోధన్

సాలూర మండల కేంద్రానికి చెందిన నిరుపేద ముస్లిం కుటుంబానికి చెందిన అక్బర్ ఖురేషి (26) యూరినల్ ట్రాక్ ఇన్ఫెక్షన్‌కు సంబంధించిన ఇబ్బందులతో బాధపడుతూ ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. యూరినల్ ఇన్ఫెక్షన్ సంబంధిత ఆపరేషన్ కోసం 3 నుంచి 4లక్షల రూపాయలు అవసరం కావడంతో చేతిలో చిల్లిగవ్వలేక అల్లాడుతున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన యువకుడికి ఆసరాగా వృద్ధురాలు అయిన తల్లి ఉంది. కొడుకు ఆరోగ్యం కోసం ఆమే నిస్సహాయ స్థితిలో ఉంది.

ఇంతకుముందు నిమ్స్ ఆస్పత్రిలో రెండుసార్లు ఆపరేషన్ జరిగిన పూర్తిగా నయం కాలేదు. దాంతో సమస్య మొదటికి వచ్చిందని బాధితుడు వాపోయాడు. మరో వారం రోజుల్లో ఆపరేషన్ చేయని యెడల యూరినల్ పూర్తిగా నిలిచిపోయి ప్రాణాపాయస్థితికి చేరుకునే అవకాశం ఉందని వైద్యులు చెప్పినట్లు బాధితుడు తెలిపాడు. దాంతో మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో గల ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆపరేషన్ కోసం దాతల సహాయం కోసం ఈ యువకుడు ఎదురు చూస్తున్నాడు. కాలనీవాసులు యువకుని ఇబ్బందులు గ్రహించి తమకు వచ్చే కూలీ డబ్బులలో కొంత పోగు చేసి రూ.20 వేలు అందించారు. దాంతో లక్షల్లో డబ్బు అవసరం కావడంతో ఆయన దాతల కోసం ఎదురుచూస్తున్నారు. గతంలో ప్రభుత్వం ద్వారా మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ ఇప్పటికే చేసిన వైద్యానికి ఖర్చు కావడంతో ప్రస్తుతం డబ్బులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దాతలు కానీ ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ కానీ తక్షణమే స్పందించి తన ఆపరేషన్ కై ఆదుకోవాలని బాధితుడు అక్బర్ కోరుతున్నారు.



బాధితుడు అక్బర్ ఖురేషి

లయన్స్ క్లబ్ ఆచన్‌పల్లి, వివేకానంద ఎంప్లాయిస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం..

ప్రపంచ మానవత దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని శనివారం రాత్రి లయన్స్ క్లబ్ ఆఫ్ ఆచన్‌పల్లి, వివేకానంద ఎంప్లాయిస్ సొసైటీ వారు బాధితుడు అక్బర్ ఖురేషి దీన పరిస్థితిని కాలనీ వారి సహాయంతో తెలుసుకుని శనివారం రాత్రి బాధిత కుటుంబాన్ని సంప్రదించి లయన్స్ క్లబ్ ఆచన్‌పల్లి వారు రూ.20వేలు, వివేకానంద ఎంప్లాయిస్ సొసైటీ వారు రూ.15వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఇల్తెపు శంకర్, ఐ.ఆర్ చక్రవర్తి, ఇల్తెపు గంగారాం, వివేకానంద ఎంప్లాయిస్ సొసైటీ ప్రతినిధులు కల్లూర్ శంకర్, సాలెన్ రాజేందర్, ఇల్తెపు ఉమేష్, కానిస్టేబుల్ అల్లే సాయికుమార్, వార్డ్ సభ్యులు మొనేగారి రాజు పాల్గొన్నారు.



లయన్స్ క్లబ్ ప్రతినిధుల ఆర్థిక సహాయం

గుప్త నిధుల కోసం..
విఫల యత్నం

- గుర్తు తెలియని దుండగుల ప్రయత్నం
- హుమ్నాపూర్‌లో ఘటన
- భయాందోళనలో గ్రామస్తులు

నవతెలంగాణ-వర్ని

గుప్త నిధుల కోసం గుర్తు తెలియని దుండగులు తవ్వకాలు చేపట్టి.. విఫల యత్నం చేశారు. ఈ ఘటన మండలంలోని హుమ్నాపూర్ గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది.

గుర్తు తెలియని వ్యక్తులు గ్రామ శివారులో గల బారెడు పోచమ్మ గుడి వెనుకాల పెద్ద గుంత తవ్వారు. అక్కడ పూజలు చేసిన వస్తువులు కనబడటంతో.. గమనించి గ్రామస్తులు అక్కడికి భారీ ఎత్తున చేరుకున్నారు. ఆ గుంతను చూసి గుర్తు తెలియని వ్యక్తులే గుప్త నిధుల కోసమే తవ్వి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇలా ఎన్నో విచిత్ర ఘటనలు చోటుచేసుకున్నాయి. దీంతో గ్రామ ప్రజలు భయందోళనకు గురవుతున్నారు.



గుప్తనిధుల కోసం తవ్విన గుంత

రేణుక ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి
నిధులు మంజూరు చేయాలి

- మంగళ్‌పాడ్ గౌడ కులస్తుల వినతి

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని మంగళ్‌పహాడ్ గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ గుడి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ, ఎడపల్లి మండలం మంగల్ పాడు గ్రామ గౌడ సంఘం పెద్దలు నాయకులు ఆదివారం బోధన్ ఎమ్మెల్యే మహమ్మద్ షకీల్ అమీర్ ను ఆయన స్వగృహంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. మంగళ్‌పహాడ్‌లో బీఆర్ఎస్ పార్టీ బలోపేతనానికి గౌడ సంఘం నాయకులతో పాటు అన్ని కుల సంఘాలలు ఐక్యత ఉన్నట్లు ఎడపల్లి మండల బీఆర్ఎస్ సంయుక్త కార్యదర్శి మాణిక్యాల సురేష్ గౌడ్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. మండలంలోని కొన్ని గ్రామాలలో శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ గుడి నిర్మాణానికి దాతలు తో పాటు ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యే సహకారంతో గుడి నిర్మాణ పనులు పూర్తయ్యాయని సురేష్‌గౌడ్ ఎమ్మెల్యేకు వివరించారు. అందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మంగళ్‌పాడ్ గ్రామంలో నిర్మాణం చేపట్టే శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ గుడి నిర్మాణానికి మొదటిసారిగా సేకరణ అనంతరం నిధులను తప్పకుండా మంజూరు చేస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు గౌడ సంఘం నాయకులు తెలిపారు. ఎడపల్లి మండలంలోని ప్రతి గ్రామంలో రేణుక ఎల్లమ్మ గుడి ఆలయ నిర్మాణం తప్పనిసరిగా ఉండాలన్నదే గౌడ సంఘం లక్ష్యమన్నారు. ఈ పాటికి ఎడపల్లి, జైతాపూర్, మరికొన్ని గ్రామాలలో శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ గుడి నిర్మాణాలు పూర్తయి పూజలు అందుకుంటున్నట్లు గౌడ సంఘం నాయకులు ఆయనకు వివరించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మంగళ్‌పాడ్ గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు పెద్ద కోమురు గౌడ్, ఆనగోని ఐలగౌడ్, దుద్దెడ కృష్ణ గౌడ్, సంఘం సీనియర్ నాయకులు, నాగేష్‌గౌడ్, రమేష్‌గౌడ్, హెూమ్ గంగాధర్‌గౌడ్, ఇల్లందుల స్వరాజ్‌గౌడ్, మాజీ సర్పంచ్ చేపూరి గంగాధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతినిస్తున్న గౌడ్స్

జుక్కల్ నియోజకవర్గానికి
మంచి నాయకున్ని ఎన్నుకోవాలి

- దళిత గిరిజన ఆత్మగౌరవ సభలో వక్తల పిలుపు

నవతెలంగాణ-పిట్లం

జుక్కల్ నియోజకవర్గంలో మంచి నాయకున్ని ఎన్నుకున్నట్లయితే మార్పు వస్తుందని వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని సాయి ఫంక్షన్‌హాల్‌లో దళిత గిరిజన ఆత్మగౌరవ సభను ఏఎస్ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు అయ్యల సంతోష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ నియోజకవర్గం ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గమైనప్పటికీ ఎందరో దళిత ఎమ్మెల్యేలు ప్రాతినిథ్యం వహించినప్పటికీ ఏ ఒక్క ఎమ్మెల్యే దళితుల పక్షాన నిలబడలేదన్నారు. ఉన్నత వర్గాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేశారని విమర్శించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యా చాలా అవసరమన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగ అంశాలు ప్రతి ఒక్కరికీ అందేలా దళితులు ఐక్యమత్యంతో ముందుకు సాగాలన్నారు. సేవాలాల్ మహారాజ్ సమాజంలో ప్రతి ఒక్కరూ జ్ఞానవంతులై ముందుకు సాగాలని సూచించారని వక్తలు కొనియాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో సభలు, సమావేశాలు నిర్వహిస్తే అక్కడ కాలికి గజ్జ కట్టి ఆడింది, పాడింది దళిత గిరిజనులేనన్నారు. ఉద్యమంలో కీలక భూమిక పాత్ర పోషించింది దళిత, గిరిజనులే నన్నారు. అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం రాష్ట్రంలో కొనసాగడం లేదన్నారు. ఒక గిరిజన మహిళపై థర్డ్ డిగ్రీ పోలీసులు ప్రయోగించినా అడిగే వారు కరువయ్యారన్నారు. దళిత మహిళ మరియమ్మ మృతిపై స్పందించలేదన్నారు. పోడు భూముల కోసం గిరిజన మహిళలు పోరాటం చేస్తే జైలుకు పంపారని మండిపడ్డారు. దళిత, గిరిజన ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకునేలా ప్రతి ఒక్కరూ యుద్ధ సైనికుల పోరాడాలని వక్తలు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షులు బధ్యానాయక్, ఆర్ఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్, ఎం.వి ఫౌండేషన్ కోఆర్డినేటర్ వెంకట్‌రెడ్డి, బహుజన సంఘాల ఐక్యవేదిక తెలంగాణ అధ్యక్షులు మారంపల్లి లక్ష్మీనారాయణ , జుక్కల్ నియోజకవర్గ బీఎస్పీ పార్టీ నాయకులు బొగుడ మీది సాయిలు, స్థానిక దళిత, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వక్తలు

నేడు మద్యం దుకాణాలకు డ్రా

- దరఖాస్తుదారులు ఎంట్రీ పాసులతో హాజరు కావాలి
- ఆబ్కారీ శాఖ పర్యవేక్షకులు రవీందర్ రాజు

నవతెలంగాణ-తాడ్వాయి

2023-25 సంవత్సరానికి నూతన మద్యం పాలసీలో భాగంగా జిల్లాలోని 49 మద్యం షాపుల కేటాయింపునకు ఈనెల 21న సోమవారం ఉదయం 11 గంటలకు సిరిసిల్ల రోడ్డులోని రేణుక ఎల్లమ్మ ఫంక్షన్ హాల్‌లో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా డ్రా తీయనున్నామని ఆబ్కారీ శాఖ పర్యవేక్షకులు రవీందర్ రాజు ఆదివారం తెలిపారు. నూతన మద్యం పాలసీలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం ఈనెల 4 నుంచి 18 వరకు దరఖాస్తులు స్వీకరించిన విషయం విదితమే. ఇందుకోసం జిల్లాలో 2,174 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుదారులు అందరూ సోమవారం ఉదయం 10 గంటల వరకు ఫంక్షన్‌హాల్‌కు ఎంట్రీ పాసులతో హాజరు కావలసిందిగా ఆయన సూచించారు. దరఖాస్తుదారుడు హాజరు కానట్లయితే వారికి సంబం ధించి టోకెన్ నెంబర్ డ్రాలో వేయ బడదని స్పష్టం చేశారు. కావున దరఖాస్తుదారుడు తమ ఎంట్రీ పాసులతో విధిగా ఫంక్షన్ హాల్లో జరిగే డ్రాకు హాజరు కావలసిందిగా రవీందర్ రాజు స్పష్టం చేశారు.



వైద్యం కోసం ఎల్ఓసీ అందజేసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-భిక్కనూర్

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఒక విద్యార్థిని మెరుగైన వైద్యం కోసం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఎల్ఓసీ పత్రాన్ని అందజేసినట్లు పట్టణ సర్పంచ్ తునికి వేణు తెలిపారు. పట్టణానికి చెందిన వార్డు సభ్యులు సిద్ధిరాములు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఇదే ఘటనలో ఆయన కూతురుకు తీవ్రగాయాలు అయ్యాయి. హైదరాబాదులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమెకు మెరుగైన వైద్యం చేయాలంటే ఐదు లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపినట్లు వివరించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే గోవర్ధన్ ఐదు లక్షల రూపాయల ఎల్ఓసీ పత్రాన్ని అందజేశారు. గ్రామ సచివాలయం తరపున ఎమ్మెల్యే గోవర్ధన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు సర్పంచి తెలిపారు.



ఎల్ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే

శెట్పల్లిలో ఒకరి అదృశం

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని శెట్పల్లి గ్రామంలో ఒకరు అదృశ్యమైనట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన వడ్ల కాశీరాం (50) ఇతను ఈనెల 17వ తేదీన మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయలుదేరి వెళ్లాడు. రాత్రి అయినా రాకపోవడంతో అతని ఆచూకీ కోసం బంధువుల వద్ద చుట్టుపక్కల వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఎవరికైనా కనిపిస్తే దయచేసి 7815899061, 7815899061 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ప్రారంభమైన శ్రావణమాసం భజనలు



భజనలో పాల్గొన్న కళాకరులు

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలోని ప్రభు స్వామి ఆలయంలో శ్రావణమాసాన్ని పరిష్కరించుకొని ఆలయంలో ఆదివారం నుంచి భజన కార్యక్రమాలు ప్రారంభించారు. ప్రతి సంవత్సరం శ్రావణమాసం మొదటి నుంచి చివరి వరకు పది రోజులపాటు ఆలయంలో భజన కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు. అందులో భాగంగానే 41 రోజులపాటు భజన కార్యక్రమాలు రాత్రివేళ నిర్వహిస్తామని, 41 రోజుల పాటు ఉపవాసాలు దీక్షలు ప్రతిరోజు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ భజన కార్యక్రమంలో పరంధాములు, వెంకటి, సత్యం, తిరుపతి, వెంకటేశం, కృష్ణయ్య, నరసింహులు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

గృహలక్ష్మి సర్వేలో కార్యదర్శులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని 17 గ్రామ పంచాయతీల పరిధిలో ఆదివారం గ్రామ కార్యదర్శులు సర్వే నిర్వహించారు. కార్యదర్శులు ఉదయం నుంచి ఆయా గ్రామాలలో ఇంటింటికి వెళ్లి సర్వే చేపట్టారు. రెంజల్ మండలంలో 2352, దరఖాస్తులు రాగా ఆదివారం రోజున 2080 పూర్తి అయ్యాయని ఎంపీఓ గౌస్‌ఉద్దీన్ పేర్కొన్నారు. మండలంలోని నీల గ్రామంలో సుమారు 650 దరఖాస్తులు రాగా, మరో 270 వరకు దరఖాస్తులు సర్వే జరపాల్సి ఉందని ఆయన తెలిపారు.



సర్వే చేపడుతున్న కార్యదర్శి

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వృద్ధురాలు మృతి

నవతెలంగాణ-ఆర్మూర్



పట్టణ బస్టాండ్ ముందర గల హైవే రోడ్డుపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వృద్ధురాలు మృతి చెందినట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ సురేష్ బాబు తెలిపారు. మృతురాలి వయస్సు సుమారు 50 నుండి 60 సంవత్సరాల మధ్య ఉంటుందని, మృతదేహం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ గదిలో భద్రపరిచినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసినవారు ఆర్మూర్ పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వవాలని అన్నారు.

రైతు వేదికలో బీఆర్ఎస్ పార్టీ సమావేశం

నవతెలంగాణ-వేల్పూర్



మండల కేంద్రంలోని రైతు వేదికలో బిఆర్ఎస్ పార్టీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను అందిస్తున్న సంక్షేమ పథకాలను మంత్రి వేముల ప్రశాంత్ చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు కడప కడపకు తెలపాలని అన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రసవత్తరంగా ఆర్మూర్ రాజకీయం

- జీవన్‌రెడ్డికి టికెట్‌పై స్పష్టత కరువు
- ఆర్మూర్ టికెట్ ఆశిస్తున్న జడ్పీ చైర్మన్ దాదన్న గారి విట్టల్ రావు!

నవతెలంగాణ-ఆర్మూర్

ఎన్నికల వాతావరణం వేడెక్కింది. 2014 అసెంబ్లీ ఎన్నికలకు ఎంతో ప్రత్యేకత ఉంది. తెలంగాణ రాష్ట్రంలో జరిగిన తొలి ఎన్నికలు. అలాగే ఓ ఉద్యమ పార్టీ అధికారంలోకి రావడానికి కారణమైన ఎలక్షన్లు కూడా ఇవే. స్వరాష్ట్రంలో జరిగిన ఈ ఎన్నికల్లో రెండుసార్లు బీఆర్ఎస్ క్లీన్ స్వీప్ చేసింది.. కారు వేగానికి రాజకీయ ఉద్దండులెందరో ఓడిపోయారు.

జిల్లాలోనే ప్రత్యేకత సంతరించుకున్న ఆర్మూర్..

ఉమ్మడి జిల్లాలలోనే ఆర్మూర్ ప్రత్యేకతను సంతరించుకుంది. ఇక్కడ రెండుసార్లు గెలిచిన ఆశన్న గారి జీవన్ రెడ్డికి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల వ్యతిరేకత విషయంలో టికెట్‌పై స్పష్టత కరువైంది. నేడు బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితాను కేసిఆర్ ప్రకటించనున్న నేపథ్యంలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ప్రభుత్వ పథకాల విషయంలో ప్రజల్లో ఎమ్మెల్యే జీవన్ రెడ్డిపై సానుకూలత ఉన్నప్పటికీ, నియోజకవర్గంలోని నందిపేట్ సర్పంచ్ సాంబారు వాణి తిరుపతి దంపతుల ఆత్మహత్యాయత్నం విషయంలోనూ, కల్లెడ సర్పంచ్ లావణ్య ప్రసాద్‌గౌడ్ దంపతుల విషయంలోనూ ఎమ్మెల్యే వ్యవహరించిన విధానం, అసభ్య పదజాలంతో





తిట్టిన ఆడియో రికార్డులను ఇంటిలిజెన్స్ ద్వారా అధిష్టానికి చేర వేశారు. కాగా ఆర్మూర్ టికెట్ విషయంలో జిల్లా వ్యాప్తంగా వివిధ వర్గాల్లో చర్చ సాగుతోంది. తెలంగాణ ఉద్యమంలో జిల్లాలోని ముఖ్య పాత్ర పోషించిన జడ్పీ చైర్మన్ దాదన్న గారి విట్టల్ రావు ఆర్మూర్ టికెట్ ఆశిస్తున్నట్లు తెలిసింది.

హస్తం వైపు ముగ్గు చూపుతున్న పలువురు...

తెలంగాణ ఇచ్చినప్పటికీ పదేళ్లపాటు అధికారానికి దూరంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ వచ్చే శాసనసభ ఎన్నికల్లో కచ్చితంగా గెలిచి తీరాలనే లక్ష్యంతో సర్వశక్తుల సిద్ధమవుతున్నారు. పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి ఆర్మూర్ నుండి పోటీ చేస్తారని ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఇక్కడ బిజెపి నియోజకవర్గ నాయకునిగా పనిచేసిన పొద్దుటూరి వినయ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరెందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తుంది. వీరితోపాటు మండలంలోని అంకాపూర్ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు మార చంద్రమోహన్ ఉండగా ఇదే గ్రామానికి చెందిన గోదావరి హైబ్రిడ్ సీడ్స్ ఎర్రజొన్నల వ్యాపారి కూనింటి మహిపాల్‌రెడ్డి సైతం కాంగ్రెస్ పార్టీలో చేరెందుకు సిద్ధమయ్యారు. ఇదే గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త పైడి రాకేష్‌రెడ్డి కమలం పార్టీలో చేరి గ్రామ గ్రామాన పాద యాత్ర చేసేందుకు సిద్ధమవుతున్నారు.

నియోజకవర్గంలో మహిళ ఓటర్లే అధికం..

నియోజకవర్గ పరిధిలో పురుషుల ఓటర్ల సంఖ్య కంటే మహిళ ఓటర్ల సంఖ్య అధికంగా ఉంది. వచ్చే సార్వత్రిక ఎన్నికలలో అభ్యర్థుల గెలుపు ఓటమిలను వారే ప్రభావితం చేయనున్నారు. నియోజకవర్గ పరిధిలో పట్టణంతో పాటు ఆర్మూర్, నందిపేట్, మాక్లూర్ మండలాల్లో కలిపి లక్ష 70 వేల 732 మంది ఓటర్లు ఉండగా, ఇందులో పురుషులు 80 వేల 325 మంది ఉండగా, మహిళలు 90 వేల 402 ఉన్నారు. పురుషుల కంటే మహిళ ఓటర్లు పదివేల పైన ఎక్కువగా ఉన్నారు. పట్టణంతో పాటు మూడు మండలాల్లో మహిళ ఓటర్ల సంఖ్య అధికంగా ఉండడంతో ఎన్నికల భారీలో నిలిచే అభ్యర్థులు ముందుగా మహిళలతో ప్రసన్నం చేసుకోవాలి. అభ్యర్థులకు మెజారిటీసైతం పది నుంచి 15 వేల లోపే ప్రతిసారి ఉండడంతో మహిళల ఓట్లే నియోజకవర్గంలో కీలకం కావడం కొసమెరుపు.

చైర్‌పర్సన్ దంపతులను సన్మానించిన విద్యానగర్ కాలనీ కమిటీ వాసులు



చైర్‌పర్సన్ దంపతులను సన్మానిస్తున్న కాలనీవాసులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో గల విద్యానగర్ కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవానికి కాలనీవాసుల ఆహ్వాన మేరకు ఆదివారం పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కమ్యూనిటీ హాల్ కు ఎమ్మెల్యే జీవన్ రెడ్డి టియుఎఫ్ఐడిసి నిధుల నుండి 25 లక్షలు కేటాయించారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికల్లో సంపూర్ణ మద్దతు ఉంటుందని ఏకగ్రీవ తీర్మానం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత పవన్ దంపతులకు కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్ తో యువకుడు మృతి

- క్రేన్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా నిండు ప్రాణం బలి

నవతెలంగాణ-బాల్కొండ



మహ్మద్ ముఫాసిల్ మృతదేహం

బాల్కొండ మండల కేంద్రంలోని మాధవ సిమెంట్ పైప్ ఫ్యాక్టరీలో ఆదివారం మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ ముఫాసిల్ (19) అనే యువకుడు విద్యుత్ షాక్ తో మృతి చెందాడు. బాల్కొండ ఎస్సై కే.గోపి తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం మధ్యాహ్నం సిమెంట్ పైప్ ఫ్యాక్టరీలో క్రేన్ డ్రైవర్ నిర్లక్ష్యంగా వ్యవహరించి అక్కడ ఉన్న 11 కె.వి విద్యుత్ వైర్లను గమనించకుండా క్రేన్ నడపడంతో ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. ప్రమాదానికి గురైన వెంటనే ఫ్యాక్టరీ సిబ్బంది ముఫాసిల్‌ను ఆర్మూర్ లోనీ ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. అంతలోనే మృతి చెందినట్లు వారు తెలిపారు. తండ్రి ముబాషీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సారు.. పట్టా పాసు బుక్కు అందించండి

- కొత్త తహసీల్దార్ పట్టించుకోవాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మా తాత నుండే ఆ స్థలంలో పంట పండించుకుంటున్నామని, మాకు పట్టా పాసు బుక్కు అందించాలని నల్ల గంగాధర్ కోరారు. సమస్య పరిష్కారం కావడంలేదని ప్రతి సోమవారం ఎన్నోసార్లు కలెక్టరేట్ కార్యాలయానికి వచ్చి వెళుతున్నానని అధికారులు ఏమాత్రం స్పందించడం లేదని నల్లగంగాధర్ మీడియాతో వాపోతున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్మర్‌పల్లి మండలం కోనసముందర్ గ్రామంలో సర్వే నెంబర్ 404/38 ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూమిని, 1920 నుంచి రాళ్లు, రప్పలు తీసి చదును చేసుకుని పంట పండించుకున్నామని అన్నారు. మా తాత నల్ల గంగారం తండ్రి రాజేవు నుండి ఇక్కడే 3ఎకరాల 33 గుంటలు విస్తీర్ణంలో పంట సాగు చేసుకొని జీవనం కొనసాగించారని తెలిపారు. తాను అదే పంట పొలాన్ని సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నానని అన్నారు. దానిని ప్రస్తుతం ఇప్పుడు తమ కోడలకు నల్ల అశ్వినికి 2014లో ఎకరం 33 గుంటలు, 2018లో నల్ల ధనశ్రీకి 2 ఎకరాలు చేసి ఇచ్చామన్నారు. వారి పేర్లతో పట్టా పాసు బుక్కు అందించాలని 2019 ఫిబ్రవరి 18 మండల రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నామని తెలిపారు. ప్రభుత్వ అధికారులు విచారణ, పంచనామా చేసేందుకు మండల రెవెన్యూ కార్యాలయం నుంచి ఆర్ఐ, డిప్యూటీ ఎమ్మార్వో వచ్చి 2019 ఏప్రిల్ 16న సర్వేయర్ బాలకిషన్ ఆ భూమిని సర్వే చేసి 2019 సెప్టెంబర్ 8న పంచనామ రాసి ఇచ్చారన్నారు. 2019 సెప్టెంబర్ 8న లొకేషన్ స్కెచ్‌ను, పొడి స్కెచ్ ను వారే ఇవ్వడం జరిగిందని తెలిపారు. అయినను ఇప్పటివరకు వారి పేర్లతో పట్టా చేసి ఇవ్వలేనందున కలెక్టర్ ను కలిసిన ప్రజావాణి లో చాలా సార్లు ఫిర్యాదు చేసిన కలెక్టర్, ఆర్డీవో, ఎంఆర్ఓ లకు సూచించారన్నారు. మొన్నటి వరకు ఉన్న ఎంఆర్ఓ లు ఎప్పుడు చేస్తాం అప్పుడు చేస్తామంటూ కాలం ఎల్లదీస్తూ వచ్చారని, ఏమాత్రం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు వచ్చిన కొత్త ఎమ్మార్వో అయినా సమస్యను పరిష్కరించి పట్టా ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ స్థలంలో పంట సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని ఆదేశించినప్పటికీ మాకు ఇంకా ఇప్పటికి పట్టాలు ఇవ్వడం లేదని ఆవేదన చెందారు. ఆ మూడు ఎకరాల స్థలంలోనే తమ తండ్రి నల్ల నర్సోజీ, నల్ల గౌరవ్వ, నల్ల రాజు భాయి సమాధులను ఏర్పాటు చేసుకున్నామని అన్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని పంట సాగు చేసుకుంటున్న స్థలానికి పట్టా పాస్ బుక్ అందించాలని కోరారు.

గొర్రెలు పంపిణీ



పంపిణీ చేసిన గొర్రెలు

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ గొల్ల కుర్మ కులస్థులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని రెండో విడతలో భాగంగా కొత్తపెట్ గ్రామానికి చెందిన కుర్మ శకుంతలకు ఒక్క యూనిట్ గొర్రెల పంపిణీ చేశారు. సర్పంచ్ లావణ్య ప్రవీణ్ గౌడ్, వెటర్నరీ డాక్టర్ ప్రమోద్, ఆల్ ద పిఎసిఎస్ చైర్మన్ జితేందర్ జూనియర్ డాక్టర్, గ్రామ పెద్దలు గొల్ల కుర్మా కులస్తులు పాల్గొన్నారు. గొల్ల కుర్మ కులస్తులు ఏ ప్రభుత్వమూ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు రుణపడి ఉంటామని ఆనందం వ్యక్తం చేశారు.

వివాహ వేడుకలకు హాజరైన బాజిరెడ్డి

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో పలు వివాహ వేడుకల్లో రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ గ్రామీణ శాసనసభ్యులు బాజిరెడ్డి గోవర్ధన్ హాజరయ్యారు. నూతన వధూవరులకు అక్షంతలు వేసి ఆశీర్వదించారు.

అబ్బాపూర్ తాండలో ఘనంగా తీజ్ పండుగ





ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని అబ్బాపూర్ తండాలో గిరిజన సంప్రదాయ పండుగ తీజ్ ను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పండగ సందర్భంగా గ్రామంలోని జగదాంబ ఆలయంలో నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 9 రోజులపాటు మొలకెత్తిన నవ ధాన్యాల నారును గిరిజన మహిళలు, యువతులు, పిల్లలు తలపై ఎత్తుకొని ఊరేగింపుగా వెళ్లి స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెద్దలు మరియు యువకులు పాల్గొన్నారు.

తిరుమల కాలనీ అభివృద్ధి కమిటీ కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-ఆర్మూర్



ఎన్నికైన కమిటీ సభ్యులు

పట్టణంలోని తిరుమల కాలనీ అభివృద్ధి కమిటీ ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏడో వార్డు కౌన్సిలర్ ఇట్టెడి నర్సారెడ్డి హాజరై కాలనీ ఎన్నికలు ప్రశాంతంగా జరుపుకోవాలని తాను సంపూర్ణంగా సహకరిస్తానని తెలిపారుఅధ్యక్ష ప్రధాన కార్యదర్శి పదవులకు పోటాపోటీగా జరిగిన ఎన్నికల్లో కుంటాల గంగాధర్ అధ్యక్షులుగా కొల్లెపు సాయిలు ప్రధాన కార్యదర్శిగా గెలుపొందారు. కాలనీ అభివృద్ధి కమిటీ ఆర్థిక కార్యదర్శిగా కటకం క్రాంతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కులకర్ణి సునీల్ రావు , పూరి రవీందర్ , గజ్జి శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నిక కావడం జరిగింది.నూతనంగా ఎన్నికైన తిరుమల కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కుంటాల గంగాధర్ మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి భారీ మెజారిటీతో గెలుపొందించిన కాలనీవాసులకు ధన్యవాదాలు తెలియజేస్తూ అన్నివేళలా అందుబాటులో ఉంటానని, స్థానిక కౌన్సిలర్ సహకారంతో ఎమ్మెల్యే జీవన్ రెడ్డి గారి సహకారంతో కాలనీ అభివృద్ధికి పాటుపడతానని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులర్ చేయడం హర్షణీయం

- గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ 711 జిల్లా అధ్యక్షునిగా బండారి భాస్కర్



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు కనక చంద్రం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

22 సంవత్సరాలుగా పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్ల సంకెళ్లను తెంచి రెగ్యులర్ చేయడం హర్షణీయమని రాష్ట్ర అధ్యక్షులు కనక చంద్రం అన్నారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా బాలుర ఖిల్లా జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కనక చంద్రం మాట్లాడుతూ..నిజామాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల గజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ 711 జిల్లా కమిటీని రాష్ట్ర అధ్యక్షులు కనక చంద్రం ప్రకటించారు. జిల్లా అధ్యక్షునిగా బండారి భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా జయనంద్, వర్కింగ్ అధ్యక్షులుగా పి. వినోద్, ఎస్. గంగాధర్, అసోసియేట్ అధ్యక్షులుగా ఎస్.వరుణ్ కుమార్, రాధాకృష్ణ, కోశాధికారులుగా డి. పరుశరాములు ఉపాధ్యక్షులుగా మహమ్మద్ ఫరీజుద్దీన్, రవి జీవ్మీ, వి. పరుశురాములు, కే.రాములు ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా రణ సంగ్రామ సింహుడు, టి. సదానం, ఏ. బాలరాజ్, మహమ్మద్ ఫయిముద్దీన్, జి.శ్రీనివాస్ గౌడ్, పి.శ్రీనివాస్, ఏ.ప్రభాకర్‌లను ప్రకటించారు. సంయుక్త కార్యదర్శిగా ఎం. రామకృష్ణ, కే.విష్ణువర్ధన్, మహిళా కార్యదర్శిగా పి. సవిత, బి.సావిత్రి, అమరిన్ కౌసర్లను ఎంపిక చేశామన్నారు. మరో ఎనిమిది మంది కార్యవర్గ సభ్యులుగా పి. శ్రీనివాస్ గౌడ్, మహమ్మద్ అబ్రార్, జి.బాలమల్లు, బి. శివయ్య, సి.గోవర్ధన్, గిరి, సంతోష్ జిల్లా కమిటీ సభ్యులుగా వ్యవహరిస్తారన్నారు. రాష్ట్రంలో మిగిలిపోయిన మరో 411 మంది ఒకేషనల్ కాంట్రాక్ట్ లెక్చరర్లు, 23 మంది జనరల్ కాంట్రాక్టు లెక్చరరులను కూడా త్వరగా రెగ్యులర్ చేయాలని ప్రభుత్వానికి విన్నవించారు. కార్యక్రమంలో జిల్లాలో ఇటీవల రెగ్యులర్ అయిన కాంట్రాక్ట్ లెక్చరర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అనాథ పిల్లల గుర్తింపు

నవతెలంగాణ-ఏర్గట్ల

జిల్లా అధికారులు ఆదేశాల మేరకు మండలంలోని అనాథ పిల్లలను గుర్తించినట్లు ఎంపీఓ శివ చరణ్ తెలిపారు. మండల కేంద్రంలో ఐదు గురు, తొర్తిలో ముగ్గురు, నాగేంద్ర నగర్‌లో ఇద్దరు,బట్టాపూర్ లో ఇద్దరు అనాథ పిల్లలను గుర్తించారు. వారి పూర్తి వివరాలను ఆన్లైన్ లో ఉంచినట్లు ఎంపీఓ తెలిపారు.

అధికారంలోకి వస్తే రెండు లక్షల రుణమాఫీ: మదన్మోహన్

భవాని పెట లో గడపగడపకు మదనన్న

నవతెలంగాణ-లింగంపేట్



మాట్లాడుతున్న మదన్‌మోహన్


కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని టిపిసిసి ఉపాధ్యక్షులు మదన్ మోహన్ అన్నారు. ఆదివారం మండలంలోని భవానీపేట్ అడుగడుగునా ఆయనకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు గ్రామంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు మదన్ మోహన్ పల్లెపల్లెకు కాంగ్రెస్ గడప గడపకు మదన్ అన్న కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మదన్ మోహన్ గ్రామస్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అమలు పరిచే సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రధాన వీధులను గుండా ర్యాలీగా వెళ్లి ఇంటింటికి వెళ్లారు ఈయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


తల్లి, బిడ్డ మిస్సింగ్

- కేసు నమోదు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

తల్లి బిడ్డల మిస్సింగ్ కేసు నమోదు చేసినుట పోలీసులు ఆదివారం తెలిపారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన గజన వెల్లి శిరీష (32) ఆమె కూతురు ప్రమిత (6) ఈనెల 19న సాయంత్రం ఐదు గంటలకు మండల కేంద్రంలో జరిగే వార సంతకని వెళ్లారు. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.





గల్ఫ్ ఏజెంట్లపై కొరవడిన నిఘా

- కోట్ల డబ్బులతో ఉడాయిస్తున్న ఏజెంట్లు

నవతెలంగాణ-ఆర్మూర్

కరోనా ప్రభావం తర్వాత గల్ఫ్‌కు తిరిగి వలసలు పెరిగాయి. ఉపాధి కోసం అరబ్ దేశాలకు వెళ్లే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. దీన్ని ఆసరాగా చేసుకొని నకిలీ ఏజెంట్ల మోసాలు పెరిగిపోతున్నాయి లక్షల్లో వసూలు చేసి ఉడాయిస్తున్నారు. మరికొందరు నకిలీ వీసాలు కట్టబెడుతున్నారు.

ఉమ్మడి జిల్లాల్లోనూ...

ఉమ్మడి జిల్లాల నుండి రోజుకు సుమారుగా 80 నుండి 100 వరకు కార్మికులు గల్ఫ్ దేశాలకు వెళ్తున్నారు. వీరిలో 60 వరకు హైదరాబాద్ మీదుగా వెళ్తుండగా మిగతావారు ట్రావెల్స్ కంపెనీల ద్వారా ముంబై నుంచి విదేశాలకు పయనమవుతున్నారు. జిల్లాల్లో నాలుగు, ఐదు ట్రావెల్స్ కంపెనీలు మాత్రమే విదేశీ మంత్రిత్వ శాఖ నుంచి లైసెన్సులు కలిగి ఉండగా మిగతావి ఎలాంటి అనుమతులు లేకుండానే ఇంటర్వ్యూలు, వీసాల జారీ ప్రక్రియను కొనసాగిస్తున్నారు.

జిల్లాలోని గల్ఫ్ ఏజెంట్ల మోసాలు రోజురోజుకు పెరిగిపోతున్నవి నియోజకవర్గంలోని నందిపేట మండలం లోని అన్నారం గ్రామానికి చెందిన బొజారం అలియాస్ సన్నీ, జిల్లా కేంద్రంలోని వినాయక నగర్‌కు చెందిన భూమేష్ అనే గల్ఫ్ ఏజెంట్లు ఒక్కొక్కరి నుండి 6 లక్షల చొప్పున డబ్బులు వసూలు చేసి ఘరానా మోసానికి పాల్పడ్డ సంఘటన ఇటీవల తీవ్ర సంచలనం రేపింది.

బాధిత వ్యక్తులు స్థానిక ఏసీపి, పోలీస్ స్టేషన్కు వచ్చి మొరపెట్టుకున్నారు. ఆరు లక్షలు కడితే ఆరు నెలల్లో 30 లక్షలు ఇస్తామని మాయ మాటలు చెప్పి అమాయకులను బోల్తా కొట్టించి సుమారుగా నాలుగు కోట్లతో ఉడాయించారు. దీంతో ఘరానా మోసాలకు పాల్పడ్డ గల్ఫ్ ఏజెంట్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

పాసు పోర్టు, ఇతర గుర్తింపు కార్డులు ఏజెంట్ల చేతుల్లో పెట్టి...

గ్రామీణ ప్రాంతాల్లో ఉండే నిరుద్యోగ యువతకు విదేశాలలో అధిక జీతాల ఆశ చూపుతూ భోజనంతో పాటు, ఉచిత వసతి సదుపాయం ఉంటుందని నమ్మిస్తున్నారు. ఇతర గుర్తింపు కార్డులను ఇస్తున్నారు. తీరా వీసా వచ్చేసిందని నమ్మించి 80 నుండి లక్ష వరకు వసూలు చేస్తున్నారు. ఇంటర్వ్యూ, మెడికల్ పరీక్షల పేరిట నెలల తరబడి కాలయాపన చేస్తూ చివరకు గల్ఫ్‌కు పంపించకుండానే నిలువునా మోసగిస్తున్నారు

గత సంవత్సరం నుండి..

పట్టణానికి చెందిన రాజేందర్ గత సంవత్సరం సౌదీ వెళ్లేందుకు ఒక ఏజెంటును ఆశ్రయించి లక్షా పదివేలు చెల్లించాడు. ప్రతినెల 30వేల వరకు వేతనం వస్తుందని, దీంతోపాటు భోజనం వసతి సదుపాయం ఉచితంగా ఇస్తారని ఏజెంటు నమ్మబలికాడు. రెండు నెలల తర్వాత సౌదీకి వెళ్లగా అక్కడ ఆయనకు కష్టాలు ఎదురయ్యాయి. జీతం 20వేలలోపే ఉండగా సొంతగా భోజనం వసతి సమకూర్చుకోవాల్సి వస్తుంది. నెలకు 10,000 అయినా మిగలడం లేదని బాధితుడు వాపోతున్నాడు. జనవరి నెలలో డిచ్‌పల్లి మండలకేంద్రంలోని ఆర్కే టూర్స్ అండ్ ట్రావెల్స్ నిర్వాకుడు షేక్ బషీర్ కువైట్ వీసాల పేరుతో 600 మందికి పైగా నిరుద్యోగులను నిండా ముంచి రాత్రికి రాత్రే హుడాయించాడు. ఇలా ప్రతి చోటా మోసాలు జరుగుతూనే ఉన్నాయి..



నిబంధనలు తుస్సు..

గల్ఫ్ ఏజెంట్లు తాము కార్యకలాపాలు సాగించే ప్రాంతాల్లో పోలీస్ స్టేషన్లో విధిగా పేర్లు నమోదు చేసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు విదేశాలకు పంపి కార్మికుల వివరాలు అందించాలని ఆదేశిస్తున్న ఈ నిబంధనలు పక్కాగా అమలు కావడం లేదు.

ఫిర్యాదులు ఇవ్వాల్సిన నంబర్లు.

100 , నిజామాబాద్ కంట్రోల్ రూమ్9490618000, కామారెడ్డి కంట్రోల్ రూమ్9492867084.

మాయ మాటలు నమ్మి మోసపోవద్దు..

గల్ఫ్ ఏజెంట్ లమాయ మాటలు నమ్మి మోసపోవద్దు.. లైసెన్సు పొందిన ట్రావెల్స్ ద్వారా వెళ్లాలి. ముందుగా డబ్బులు ఇచ్చి మోసపోవద్దు. ప్రతి ఒక్కరూ పూర్తి సమాచారం తెలుసుకున్న తర్వాతనే డబ్బులు ఇవ్వాలి.



కోటపాటి నరసింహ నాయుడు,, ప్రవాస భారతీయుల హక్కుల సంక్షేమ వేదిక నాయకులు, ఆర్మూర్..

అగ్ని ప్రమాదాల నివారణ చర్యలు పాటించాలి

- అగ్ని మాపక అధికారి జే మధుసూదన్ రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్



అకస్మాత్తుగా అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు నివారణ పద్ధతులను పాటిస్తే నష్టం ఎక్కువగా వాటిల్లకుండా ఉంటుందని అగ్నిమాపక అధికారి జె మధసూదన్ రెడ్డి ఆదివారం తెలిపారు. వర్షాకాలంలో షార్క్ సర్క్యూట్ అయ్యి ఫైర్ అయ్యే అవకాశం ఉంటుందని, దుకాణదారులు షాపులను మూసి వేసేటప్పుడు మెయిన్ స్విచ్ ఆపు చేయడం మర్చిపోవద్దని సూచించారు బహుళ అంతస్తుల యందు అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు ఏ విధంగా మంటలను ఆర్పివేయాలో పాఠశాలలు, కళాశాలల యందు సైతం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే 101 కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు. ముఖ్యంగా షాపింగ్ మాల్లు, అపార్ట్మెంట్ల యందు ఫైర్ సేఫ్టీ నియమ నిబంధనలు పాటించాలని సూచించారు.

కిలిమంజారో శిఖరాన్ని అధిరోహించిన మారుతికి సన్మానం

నవతెలంగాణ- నవీపేట్

ఆఫ్రికాలోని కిలిమంజారో శిఖరాన్ని విజయవంతంగా అధిరోహించి తిరిగి గ్రామానికి విచ్చేసిన మండలంలోని నాలేశ్వర్ గ్రామ యువకుడు ఆర్మూర్ మారుతికి సొసైటీ చైర్మన్ మగ్గరి హన్మాన్లు ఆదివారం స్వాగతించి సత్కరించారు. దేశం గర్వించే విధంగా గ్రామానికి పేరు తీసుకువచ్చిన మారుతిని పలువురు ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరింత రాణించి ముందడుగు వేయాలని పలువురు ఆకాంక్షించారు.


మారుతిని సన్మానిస్తున్న చైర్మెన్

రెంజల్ మండలంలో ఆరుగురు గ్రామ కార్యదర్శులు రెగ్యులర్

నవతెలంగాణ-రెంజల్

రెంజల్ మండలంలో గత కొన్ని సంవత్సరాలుగా గ్రామ కార్యదర్శులుగా పని చేస్తున్న ఆరుగురు రెగ్యులర్ అయ్యారు. దూపల్లి గ్రామ కార్యదర్శి సిహెచ్ సాయిలు, కందకుర్తి గ్రామ కార్యదర్శి నవీన్, నీలా గ్రామ కార్యదర్శి బి.రాణి, పేపర్‌మిల్ గ్రామ కార్యదర్శి అమీరిన్, దండిగుట్ట గ్రామ కార్యదర్శి గౌతమి, కల్లాపూర్ గ్రామ కార్యదర్శి రోజా రెగ్యులర్ అయ్యారని ఎంపీఓ గౌస్ ఉద్దీన్ పేర్కొన్నారు.

రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివి

- పలువురు నాయకులు

నవతెలంగాణ-విలేకరుల బృందం

రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివని పలువురు కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఆదివారం జిల్లాలోని పలుచోట్ల మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎల్లారెడ్డి :పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ మదన్ మోహన్ ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయన దేశానికి చేసిన సేవలను గుర్తుచేసారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆరిఫ్, అజార్, లక్ష్మణ్ ఠాగూర్, పరమేష్, సర్దార్ నాయక్, సాయిబాబా, మధు, రాజు, మహేష్ పాల్గొన్నారు.

దోమకొండ : మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అనంతరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి అబ్రబోయిన స్వామి ఆధ్వర్యంలో మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ సేవలు మరువలేని అని, భారత దేశాన్ని ఆర్థిక, సాంకేతిక రంగాలలో అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. దేశం కోసం ప్రాణాలర్పించారని, ప్రతి ఒక్కరు ఆయన ఆశయం సాధనకు కృషి చేయాలనీ కోరారు.


ఎల్లారెడ్డి : నివాళులర్పిస్తున్న నాయకులు


దోమకొండ : పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్రబోయిన స్వామి, మండల శాఖ అధ్యక్షుడు అనంతరెడ్డి, యువజన మండల అధ్యక్షుడు ఆశబోయిన శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు సీతారామ మధు, యువజన అధ్యక్షుడు రమేష్, కాంగ్రెస్ నాయకులు నాగారపు రాములు, గోపాల్‌రెడ్డి. బాల్రాజ్, సీతారాం, ప్రసాద్, నాగవరపు, లింగం, బంధం రాజేశ్వర్, రసూల్ మహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూర్ : మండల కేంద్రంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు చంద్రకాంత్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భీమ్ రెడ్డి మాట్లాడుతూ దేశ ప్రధానిగా అన్ని వర్గాల సంక్షేమానికి రాజీవ్ గాంధీ ఎన్నో పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు దయాకర్ రెడ్డి, మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుదర్శన్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి లింబాద్రి, పట్టణ మాజీ ఉపసర్పంచ్ మోహన్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి చేపూరి రాజు, నాయకులు రవి, కిరణ్ కుమార్, జీవన్, రమేష్ రెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డి : మండలంలోని రెడ్డిపెట్, రామారెడ్డిలో మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ 79వ జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలఅధ్యక్షులు నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దికుంట నరసగౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిరెడ్డి మహేందర్‌రెడ్డి, నాయకులు బండి ప్రవీణ్, గజ్జల చిన్నరాజు, పెండ్యాల నర్సారెడ్డి, నాయిని నరసింహులు, కుమ్మరి శంకర్, జైనుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

మాచారెడ్డి : మండలంలోని గజియా నాయక్ తాండ ఎక్స్‌రోడ్‌లో రాజీవ్ గాంధీ 79వ జయంతి సందర్భంగా ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాచారెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గణేష్ నాయక్ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ తన చివరి ఊపిరి వరకు ఉన్నంతవరకు దేశం కోసం ఆ విశ్రాంతిగా శ్రమించిన ధీరుడు నిరుపేదలకు అండగా నిలిచిన ఆపద్బాంధవుడు దేశాన్ని ప్రగతి బాటలో నడిపిన భారతరత్న మాజీ ప్రధాని స్వర్గీయ శ్రీ రాజీవ్ గాంధీ అని కొనియాడారు. కార్యక్రమంలో యూత్ మండలాధ్యక్షులు చెల్లాపురం రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ జాదవ్, ఎస్టీ సెల్ అధ్యక్షులు భూక్య శంకర్ నాయక్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు సతీష్, కాంగ్రెస్ యూత్ నాయకులు రాజేందర్ యాదవ్, మహేష్, బాషా, శ్రీను, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.


మాచారెడ్డిలో...


రామారెడ్డిలో..

డోంగ్లి సర్పంచుల ఫోరం మండలాధ్యక్షునిగా మధుకర్ పటేల్


మధుకర్ పటేల్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-మద్నూర్

నూతనంగా ఏర్పడిన డోంగ్లి సర్పంచుల ఫోరం మండలాధ్యక్షునిగా లింబూర్ గ్రామ సర్పంచ్ మధుకర్ పటేల్ ఎన్నికయ్యారు. గౌరవ జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ షిండే ఆధ్వర్యంలో సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షులుగా మధుకర్ పటేల్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మద్నూర్ బీఆర్ఎస్ మండలాధ్యక్షులు బన్సీ పటేల్, డోంగ్లి బీఆర్ఎస్ మండలాధ్యక్షులు శశాంక్ పటేల్, సొసైటీ చైర్మన్ శ్రీను పటేల్, మద్నూర్ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు ధరాసవార్ సురేష్, ఉమ్మడి మండల సర్పంచులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత తండ్రి మృతి



నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని వడ్డేపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కేకేసీ మండల కోఆర్డినేటర్ మెగావత్ సరిదాస్, తండ్రి మేగావత్, పాన్య నాయక్ (70), అనారోగ్యంతో ఆదివారం ఉదయం మృతిచెందారు. గ్రామంలో అందరితో కలుపుగోలుతనంగా ఉండే పాన్యా నాయక్ మృతి చెందిన విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఆయనకు సంతాపం వ్యక్తం చేసి నివాళులు అర్పించారు. పాన్యనాయక్ అంత్యక్రియల్లో ఎడపల్లి, బోధన్, ఎడపల్లి, రెంజల్, నవీపేట్ మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కేకేసీ మండల గ్రామ కో ఆర్డినేటర్లు, స్నేహితులు, బంధువులు పాల్గొన్నారు.

పాన్యనాయక్ మృతికి సంతాపం..

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సరిదాస్ తండ్రి పాన్య నాయక్ మృతి చెందడం పట్ల ఎడపల్లి మండలం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎడపల్లి మాజీ సర్పంచ్ శంకర్ నాయుడు భాస్కర్ రాజ్, బోధన్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కెప్టెన్ కరుణాకర్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.

ఆశాజనకంగా సోయా పంట

- వర్షంతో రైతుల్లో ఆనందం


వర్షానికి కళకళలాడుతున్న సోయా పంట

నవతెలంగాణ-రెంజల్

మండలంలో సోయపంట ఆశాజనకంగా ఉందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శనివారం కురిసిన వర్షం సోయా పంటకు అనుకూలంగా మారిందని వారు పేర్కొన్నారు. సోయ పంట పూత దశకు వచ్చిందని, ఈ సమయంలో వర్షం పడడం ఎంతో లాభదాయకమని వారన్నారు. రెంజల్ మండలంలో సుమారు 5400 ఎకరాలలో సోయా పంటను వేశారని, వ్యవసాయ అధికారి లక్ష్మీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. సోయ పంటకు ఎలాంటి చీడపీడలు లేవని వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు. అక్కడక్కడ పొగాకు పంటకు లద్దె పురుగు సోకిందని రైతులు నివారణ చర్యలు చేపట్టుకుంటే సరిపోతుందన్నారు.

మహిళలను విమర్శించే నీచ సంస్కృతి

కాంగ్రెస్ పార్టీ నాయకులదే

- మాజీ మండల రైతు సమితి అధ్యక్షులు బుద్దె రాజేశ్వర్

నవతెలంగాణ-బోధన్

మహిళలను విమర్శించే నీచమైన సంస్కృతి సాంప్రదాయం కాంగ్రెస్ పార్టీ నాయకులదేనని మాజీ మండల రైతు సమితి అధ్యక్షులు బుద్ది రాజేశ్వర్ అన్నారు. ఆదివారం సాలూర మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులతో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై, ఎమ్మెల్యే సతీమణి ఆయేషా ఫాతిమాపై కాంగ్రెస్ నాయకులు రవీందర్‌రెడ్డి నీచమైన విమర్శలు చేయడం ఆయన అవివేకానికి నిదర్శనమని మండిపడ్డారు. కనీసం వార్డు సభ్యుడిగా గెలవలేని నీవు ఎమ్మెల్యేను విమర్శించడం సిగ్గు చేటన్నారు. అలాగే మంధర్న రవి ఎమ్మెల్యే దగ్గర వచ్చి మొకరిల్లి పనులు చేసుకుని ఇప్పుడు ఎమ్మెల్యే షకీల్‌నే విమర్శించడం పనికిమాలిన చర్య అని అన్నారు. మంధర్న సర్పంచ్‌గా చేసినప్పుడు రవి చేసిన అవినీతి మొత్తం వెలికితీస్తామని హెచ్చరించారు. మరోసారి ఎమ్మెల్యే షకీల్ ఆమేర్‌ని, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను విమర్శిస్తే తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో ఏఎంసీ వైస్ చైర్మెన్ షకీల్, సొసైటీ చైర్మెన్ అల్లె జనార్దన్, సురేష్ పటేల్, మంధర్న సర్పంచ్ గంగాధర్, ఖాజాపూర్ సర్పంచ్ నాగయ్య, ఫతేపూర్ సర్పంచ్ అమీర్, ఐడీసీఎంఎస్ డైరెక్టర్ రాజాగౌడ్, హున్సా ఎంపీటీసీ శివకుమార్, బీఆర్ఎస్ నాయకులు, డిస్కో సాయిలు, కేజీ గంగారాం, వెంకట్ పటేల్, నాగురావ్, శివకాంత్ పటేల్, చందు, సాయిరెడ్డి, ఎస్.కె మౌలానా, చాంద తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బుద్దె రాజేశ్వర్

పట్టణ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో..

కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే షకీల్ ఆమేర్‌పై ఆయన సతీమణి ఆయేషా ఫాతిమాపై చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ పట్టణ కమిటీ అధ్యక్షులు రవీందర్ యాదవ్ తీవ్రంగా ఖండించారు. ఆదివారం బోధన్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి కరోనా కాలంలో నియోజకవర్గ ప్రజలకు కనీసం మంచినీళ్లు తాగించలేదని ఆయన చరిత్ర అంతా చెప్పుకోదగినంత గొప్పది కాదని అసహనం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి అనుచరులు అనవసరమైన వ్యాఖ్యలు చేస్తే వారి భరతం పడతామని హెచ్చరించారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్, వీఆర్ దేశాయ్, ఫ్లోర్ లీడర్ గంగారాం తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు ఒక్కటే

- బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బైండ్ల పోచన్న


మాట్లాడుతున్న బైండ్ల పోచన్న

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు ఒక్కటేనని బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బైండ్ల పోచన్న అన్నారు. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌కు ఓటు వేసినా బీఆర్ఎస్‌కి ఓటు వేసినట్లేనని తెలిపారు. కేటీఆర్ రాక కేవలం ఎలక్షన్ స్టంట్ అని, 2018 అసెంబ్లీలో ఎల్లారెడ్డిలో కేసీఆర్ ఎల్లారెడ్డి బహిరంగా సభలో అడ్లూర్ ఎల్లారెడ్డి చేరువుని 60 కోట్లపై నిధులతో టూరిజం చేస్తానని ఇప్పటికే చేయలేదని, మంజీరా నది మీద 20 కోట్లతో చెక్ డ్యామ్ నిర్మించి ఎల్లారెడ్డి మండలనికి తాగునీరు, సాగునీరు అందిస్తామని చెప్పి మాట తప్పారని అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ పెట్టి ఐకేపీ మహిళ సంఘాలకు 6 వేల ఉద్యోగాలు కల్పిస్తామని మాట ఇచ్చి తప్పారని అన్నారు. తెలంగాణలో ఎన్నడూ లేని విధంగా సర్పంచ్‌ల ఆత్మహత్యలు, విద్యార్థుల ఆత్మహత్యలు అన్ని ప్రభుత్వ హత్యలే అని అన్నారు. 10టీఎంసీల వాటర్ చెక్ డ్యామ్‌ల ద్వారా ధర్మరావ్‌పేట్, మోతె, గుజ్జుల్‌లో నిర్మిస్తానని చెప్పారని తెలిపారు. అభివృద్ధి అంటే సిద్దిపేట్, సిరిసిల్ల తప్ప వేరే జిల్లాలు కేటీఆర్‌కు గుర్తుకు రావడం లేదన్నారు. బీసీలకు లక్ష రూపాయలు ఇస్తా అని ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. బీజేపీ ప్రభుత్వం వస్తేనే అభివృద్ధి జరుగుతుందని ఈ అవినీతి పాలన, కుటుంబ పాలనను ప్రజలు చరమగీతం పాడాలని అన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు సతీష్, బాలరాజు, బాలయ్య, సాయిలు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో బాగేపల్లి ఉప సర్పంచ్ చేరిక


చేరిన ఉపసర్పంచ్


నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బాగేపల్లి ఉప సర్పంచ్ సుంకరి సుదర్శన్ బోధన్ ఎమ్మెల్యే మహమ్మద్ షకీల్ ఆమేర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గతంలో ఆయన కాంగ్రెస్ పార్టీలో ఉండగా బీఆర్ఎస్ పార్టీ సంక్షేమ పథకాలకు ఆకర్షితుడై ఈ పార్టీలో చేరినట్లు ఆయన పేర్కొన్నారు. రెంజల్ మండలం సాటాపూర్ గ్రామానికి చెందిన పత్రి సురేష్ బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షులు బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు స్థానిక సర్పంచ్ వికార్ పాషా తెలిపారు. మండలంలోని కూనేపల్లి గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్తలు, బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు సర్పంచ్ రోడ్డ విజయ లింగం పేర్కొన్నారు.

గోదావరిలో పుణ్య స్థానాలు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి గోదావరి త్రివేణి సంగమంలో ఆదివారం భక్తుల అత్యధిక సంఖ్యలో విచ్చేసి తమ మొక్కలను తీర్చుకున్నారు. గోదావరిలో పుణ్య స్థానంలో ఆచరించి తెప్పలను విడిచారు. కుల మతాలకతీతంగా ముస్లిం మహిళలు తీపి వంటలను తయారుచేసి తమ మొక్కలను తీర్చుకోవడం విశేషం. సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసే భక్తులకు తెప్పలు తయారు చేసుకోవడానికి గడ్డి దొరకకపోవడంతో ఈ గ్రామానికి చెందిన మహిళ పోసాని తెప్పలను తయారు చేసి 30 నుంచి 40 రూపాయల వరకు విక్రయిస్తున్నట్లు ఆమె పేర్కొంది. ప్రస్తుతం గడ్డి దొరకకపోవడంతో తాను రైతుల వద్ద గడ్డిని కొనుగోలు చేసి తెప్పలు తయారు చేస్తున్నానని ఆమె అన్నారు.


స్నానమాచరిస్తున్న పలువురు

విద్యార్థులకు ఎమ్మెల్సీ కవిత

కుమారుల చేయూత

- 10 మంది విద్యార్థులకు ఎస్ఓఎం ఫౌండేషన్ ద్వారా స్కాలర్‌షిప్‌లు అందజేత
- మరో పదేళ్ళ పాటు స్కాలర్ షిప్ ఇవ్వడానికి సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజీతో ఒప్పందం

నవతెలంగాణ-ఎడపల్లి

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకంట్ల కవిత కుమారులు ఆదిత్య ఆర్యా చిన్న వయస్సులోనే పెద్ద మనస్సును చాటుకున్నారు. సమాజ సేవ కోసం ఇటీవల ఆదిత్య, ఆర్యా కలిసి మొదలుపెట్టిన సినర్జీ ఆఫ్ మైండ్స్ (ఎస్ఓఎం) ఫౌండేషన్ ద్వారా ఆడబిడ్డల చదవుకు చేయూతనిచ్చారు. హైదరాబాద్‌లోని సెయింట్ ఫ్రాన్సిస్ మహిళా కాలేజీలో అడ్మిషన్ లభించిన ఆర్థికంగా వెనుకబడిన 10 మంది మహిళా విద్యార్థులకు ఫౌండేషన్ నుంచి స్కాలర్ షిప్‌లను అందజేశారు. 10 మంది విద్యార్థుల్లో ఆరుగురు అండర్ గ్రాడ్యుయేట్, ముగ్గురు పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు ఉన్నారు. ఈ మేరకు కాలేజీలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, కాలేజీ ప్రతినిధుల సమక్షంలో విద్యార్థులకు స్కాలర్ షిప్‌ను ఆదిత్యా ఆర్యా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ.. మహిళా సాధికారతకు తాము ఎప్పుడూ మద్దతిస్తుంటామని తెలిపారు. తన కుమారులు ఇద్దరు సమాజ సేవ కోసం ఫౌండేషన్‌ను స్థాపించి విద్యార్థులకు చేయుతనందించడం సంతోషంగా ఉందన్నారు. చిన్న వయస్సుల్లోనే వాళ్ళు గొప్పగా ఆలోచించడం తల్లిగా తాను గర్వపడుతున్నానని చెప్పారు. భవిష్యత్తులోనూ ఫౌండేషన్ మరిన్ని కార్యక్రమాలు చేపట్టి సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్సీ కవిత స్కాలర్ షిప్ అందుకున్న విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఎడపల్లి ఎంపీపీ కొండెంగల శ్రీనివాస్ ఎమ్మెల్సీ కవిత కుమారులు అతిపెద్ద వయసులోనే సేవా కార్యక్రమాలు ఆర్థికంగా ఇబ్బందులు ఉన్న చదువుకునే బాల బాలికలకు అండగా నిలవడం గర్వకారంగా ఉందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఉన్నత విద్య చదివే బాలికలు మంచి చదువులో బాగా రాణించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు.


స్కాలర్‌షిప్‌లను అందజేస్తున్న దృశ్యం

108 అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

- తల్లీబిడ్డలు సురక్షితం

నవతెలంగాణ-గాంధారి

మండలం లోని మడుగుతండాకు చెందిన బాధవత్ రోజాకి పురిటి నొప్పులు రావడంతో సహాయం కొరకు 108కి కాల్ చేశారు. అక్కడికి వెళ్లిన 108 సిబ్బంది రోజా 3వ కాన్పు కావడం వల్ల నొప్పులు ఎక్కువ రావడం వల్ల గాంధారి గవర్నమెంట్ హాస్పిటల్ తీసుకువెళ్లారు. అక్కడ నార్మల్ డెలివరీ కాకపోవడం వల్ల మళ్ళీ 108 కాల్‌చేశారు. అక్కడ నుంచి కామారెడ్డి హాస్పిటల్‌కు పంపారు. మార్గం మధ్యలో నొప్పులు ఎక్కువ రావడంతో 108 సిబంది రోజాకు అంబులెన్సులోనే కాన్పు చేశారు. బాబు బొడ్డు తాడు మెడకి చుట్టుకొని ఉందని గమనించి 108 సిబ్బంది క్షేమంగా తీసేసి బాబు కేర్ తీసుకునేలా చూసుకున్నారు. తరువాత కామారెడ్డి హాస్పిటల్‌కు తరలించారు. రోజా వాళ్ల అన్న. కుటుంబ సభ్యులు 108 ఈఎన్‌టీ సురేష్, పైలట్ సంజీవ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


అంబులెన్స్‌లో క్షేమంగా తల్లీబిడ్డ

25న హైదరాబాద్‌లో ముదిరాజ్ ప్లీనరీ సభ

- విజయవంతం చేయాలి
- ముదిరాజ్ సంఘం నాయకులు

నవతెలంగాణ-రెంజల్

ఈ నెల 25న హైదరాబాదులో నిర్వహిస్తున్న ముదిరాజ్ ప్లీనరీ సభను విజయవంతం చేయాలని రెంజల్ మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు మమ్మాయి నాగరాజ్, తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా కార్యదర్శి ఎమ్మెస్ రమేష్ కుమార్ తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ముదిరాజులు అత్యధిక సంఖ్యలో ఉన్న జిల్లాలలో ముదిరాజులకు ప్రత్యేక అసెంబ్లీ సీట్లు కేటాయించాలని, జిల్లాకు రెండు అసెంబ్లీ సీట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యారంగంలో జరుగుతున్న అన్యాయాలకు అనుగుణంగా బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి మార్చే ప్రక్రియను కమిషనర్ వెంటనే ఏర్పాటు చేయాలని వారు పేర్కొన్నారు. అన్ని జిల్లాలలో సొసైటీల ఏర్పాటు, చెరువులలో సభ్యత్వం, ముదిరాజ్ కార్పొరేషన్‌కు 1000 కోట్లు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండలంలోని గ్రామాల అధ్యక్షులు టి. అంజయ్య, పోశెట్టి, రాజేశ్వర్, పోచమల్లు, హనుమంతు, గంగాధర్, అబ్బయ్య, సాయిలు, మండల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో వర్కర్లను అటెండర్లుగా గుర్తించాలి

- వేరే జిల్లాలో మల్టీజోన్లో పని చేస్తున్న వీఆర్‌ఏలను సొంత జిల్లాలకు తీసుకురావాలి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వీఆర్‌ఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పీహెచ్‌సీలో వర్కర్లుగా నియమించిందని, వారిని అటెండర్లుగా గుర్తించాలని మండలా వీఆర్‌ఏల యూనియన్ అధ్యక్షుడు రొడ్డ సాయన్న అన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వేరే జిల్లాల్లో మల్టీజోన్లో పని చేస్తున్న వీఆర్‌ఏలను వెంటనే ప్రభుత్వం సొంత జిల్లాలకు తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. వీఆర్‌ఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ పే స్కేల్ వర్తింపజేస్తూ నిర్ణయం తీసుకున్న సీఎంకి, మంత్రి ప్రశాంత్ రెడ్డికి, ఎమ్మెల్యేలు జీవన్ రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్‌కు రుణపడి ఉంటామని అన్నారు. వేరే జిల్లాలలో మల్టీ జోన్లలో పడిన వీఆర్‌ఏలను తమ సొంత జిల్లాలకు తీసుకురావాలన్నారు. మున్సిపాలిటీలలో పిహెచ్సి వర్కల్లుగా ఉన్నవారిని అటెండర్లుగా గుర్తించాలని కోరారు. సీఎం కేసీఆర్‌కు జీవితాంతం రుణపడి ఉంటామని పేర్కొన్నారు.

బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్‌గా అరికెల శ్రీకాంత్ రెడ్డి



నవతెలంగాణ-మోపాల్

నియోజవర్గ సమావేశంలో భాగంగా ధర్పల్లిలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథి శ్రీ తరంగ గోగాయి అస్సాం ఎమ్మెల్యే చేతుల మీదుగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నియోజకవర్గ ఇన్చార్జ్ దినేష్ కులాచారి, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు సందగిరి రాజశేఖర్ రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ గడ్డె భూమన్న, జిల్లా కార్యదర్శి నక్క రాజేశ్వర్, అసెంబ్లీ కన్వీనర్ పద్మా రెడ్డి సమక్షంలో నియమక పత్రాన్ని అరికెల శ్రీకాంత్‌కు అందించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు రవి, జగన్ రెడ్డి వెంకటరమణ నాయుడు రాజన్న గంగన్న ఆనంద్ రాజేశ్వర్ రెడ్డి శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివి

- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

రాజీవ్ గాంధీ సేవలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్‌జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం భారతరత్న రాజీవ్ గాంధీ 79వ జయంతి సందర్భంగా కాంగ్రెస్ భవన్‌లో ఆయన చిత్రపటానికి, వినాయక్ నగర్‌లోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. దేశంలోని యువతకు ప్రజాస్వామ్యంలో హక్కు కల్పించడానికి 18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించిన వ్యక్తి రాజీవ్ గాంధీ అని, భారతదేశం సాంకేతిక రంగంలో ప్రపంచ దేశాలతో కలిసి ముందుకు వెళుతుంది



ఆర్మూర్ : నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

అంటే అది కేవలం రాజీవ్ గాంధీ తీసుకువచ్చిన సాంకేతిక విప్లవం ద్వారానే సాధ్యమైందని అన్నారు. ఈ సందర్భంగా పిసిసి ఉపాధ్యక్షులు తాహెర్ బిన్ హందన్ మాట్లాడుతూ..



కంఠేశ్వర్‌లో..

గ్రామాలు బాగుపడాలంటే నిధులను స్వేచ్ఛగా వినియోగించుకోవాలంటే 73వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీరాజ్ చట్టాన్ని తీసుకువచ్చిన వ్యక్తి రాజీవ్ గాంధీ అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు ముప్ప గంగారెడ్డి,మాజీ బిసి సెల్ అధ్యక్షులు శేఖర్ గౌడ్, నియోజకవర్గ కో ఆర్డినేటర్ మజీద్ ఖాన్, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విపుల్ గౌడ్, జిల్లా బిసి సెల్ అధ్యక్షులు నరేందర్ గౌడ్, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సంతోష్, పిసిసి మెంబర్ ఈసా, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సుధాకర్ రావు, నగర మైనారిటీ అధ్యక్షులు ఏజాజ్, ఎస్సీ అధ్యక్షులు వినయ్,ధర్మ గౌడ్,నగర ఎస్టీ సెల్ అధ్యక్షులు సుభాష్ పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: రాజీవ్ గాంధీ సాంకేతిక విప్లవం ద్వారా భారతదేశాన్ని ప్రపంచ దేశాలతో పోటీపడే విధంగా పునాదులు వేశారనికాంగ్రెస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు వినోద్ అన్నారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మండల యువజన విభాగం మండల ప్రధాన కార్యదర్శి వసంతరావు, మైనార్టీ అధ్యక్షులు సైకిల్ టాక్స్ అక్బర్, జిల్లా జనరల్ సెక్రటరీ లక్ష్మణ్, వైస్ ప్రెసిడెంట్ యూత్ ప్రణయ్, రూరల్ వైస్ ప్రెసిడెంట్ యూత్ సుదీర్, నియమత్ అలి, సొప్పరి ప్రశాంత్, కేశపల్లి మధు పాల్గొన్నారు.

ఆర్మూర్ : పట్టణంలోని అంగడి బజారులో గల రాజీవ్‌గాంధీ విగ్రహనికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి ఆయన దేశానికి చేసిన సేవలను, తీసుకువచ్చిన విప్లవత్మక మార్పులను గుర్తు చేసుకొని ఆయన ఆశయాలను కొనసాగిస్తాం అని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సాయిబాబా గౌడ్, మార చంద్రమోహన్, కోలా వెంకటేష్, మీర్ మాజీద్, అజ్జు, జిమ్మి రవి, మందుల పోశెట్టి, బట్టు శంకర్, హబీబ్, తదితరులు పాల్గొన్నారు..

వేల్పూర్: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ చిత్రపటానికి కాంగ్రెస్ నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



జక్రాన్‌పల్లిలో..



వేల్పూర్‌లో..

రోటరీ సేవలు అభినందనీయం

- బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆశన్నగారి రాజేశ్వర్‌రెడ్డి



మొక్కను నాటుతున్న రోటరీ సభ్యులు

నవతెలంగాణ-ఆర్మూర్

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవలు అభినందనీయమని, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆశన్న గారి రాజేశ్వర్ రెడ్డి అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో అధ్యక్షులు పట్వారి గోపికృష్ణ అధ్యక్షతన ఆదివారం - అరగంట అనే కార్యక్రమాన్ని పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోగల ప్రభుత్వ పార్కులో శుభ్రత మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ పరిసర శుభ్రత కోసం రోటరీ చేపట్టిన ఆదివారం అరగంట కార్యక్రమం అందరికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ప్రతి వార్డులో ప్రజలు పరిసరాల శుభ్రతపై అవగాహన పెంచుతూ ఆర్మూర్ స్వచ్ఛతకు తోడ్పడాలని అన్నారు. కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ నాయకులు పండిత్ పవన్, కార్యదర్శి పట్వారి తులసి, కోశాధికారి లక్ష్మీనారాయణ ప్రాజెక్ట్ చైర్మన్ స్థానిక కౌన్సిలర్ లింబాద్రి గౌడ్, లింగాగౌడ్, కాంతి గంగారెడ్డి, పద్మ మురళి, పుష్పకరావు, చరణ్ రెడ్డి, శశిధర్, వన్నెల్దాస్ రాము,గోనె శ్రీధర మున్సిపల్ సానిటరీ ఇంచార్జ్ మహేశ్, కౌన్సిలర్ రమేష్ పాల్గొన్నారు..

మహాత్మ జ్యోతిబాపూలే కళాశాలలో ఎంబీసీ విద్యార్థుల చేరిక



ఎంబీసీ నాయకులను సన్మానిస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-నవీపేట్

రాష్ట్ర ప్రభుత్వం మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాల, కళాశాలలో ఎంబీసీ విద్యార్థులకు ఇచ్చిన 5 శాతం రిజర్వేషన్‌ను సద్వినియోగం చేసుకొని 14 మంది విద్యార్థులను ఎంబీసీ నాయకులు చేర్పడంపై యంచ సర్పంచ్ లహరి ప్రవీణ్ కుమార్ ఆదివారం హర్షం వ్యక్తం చేస్తూ సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంబీసీ రాష్ట్ర అధ్యక్షులు నరహరి రాష్ట్ర కార్యవర్గ విజ్ఞప్తి మేరకు ఎంబీసీ కులాలకు చెందిన తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి నిజామాబాద్ జిల్లాలో గల మహాత్మా గాంధీ జ్యోతిబాపూలే కళాశాలలో 14 మంది విద్యార్థులను చేర్పడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఎంబిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు పాడ్దే రాజు, కార్యనిర్వాహక అధ్యక్షులు అశోక్ రెడ్డి ఆర్గనైజింగ్ సెక్రటరీ మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పద్మశాలీలు రాజకీయంగా, ఆర్థికంగా మరింతగా ఎదగాలి

- శంఖారావం పోస్టర్ల ఆవిష్కరణ




శంఖారావం పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పద్మశాలీలు

నవతెలంగాణ-ఆర్మూర్

పద్మశాలీలు రాజకీయంగా, ఆర్థికంగా మరింత ఎదగాలని కలసి కట్టుగా సమాజం కోసం ఉద్యమించాలని పద్మశాలి సంక్షేమ సేవాసమితి అధ్యక్షులు మ్యాక మోహన్ దాస్, ప్రధాన కార్యదర్శి జొక్కుల రమాకాంత్ అన్నారు. అఖిల భారత పద్మశాలీ సంఘం, తెలాంగాణ ప్రాంత పద్మశాలి సంఘం సెప్టెంబర్ 3న సరూర్‌నగర్ స్టేడియం హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న పద్మశాలీ రాజకీయ శంఖారావం పోస్టర్లను ఆదివారం ఆర్మూర్ నియోజకవర్గం పిప్రి గ్రామములో, బాల్కొండ నియోజకవర్గం మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో మోర్తాడ్ పద్మశాలీ సంఘం అధ్యక్షులు చిలివేరి రవి, పిప్రి పద్మశాలి అధ్యక్షులు నాందాల లింబాద్రి, మనోహర్, సభ్యులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మ్యాక మోహన్ దాస్ మాట్లాడుతూ.. పద్మశాలీలు రాజకీయంగా ఎదిగినప్పుడే వారి సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో పద్మశాలిలు ఉన్నప్పటికీ రాజకీయంగా అణచి వేయబడుతున్నారని అన్నారు. చిలివేరి రవి మాట్లాడుతూ మన ఓటు, మన సీటు మన వాటా ప్రకారం పద్మశాలి లకు కేటాయించాలని వివిధ పార్టీలకు అల్టీమేటం జారీ చేయాలనీ అన్నారు. కొక్కుల రమాకాంత్ మాట్లాడుతూ పద్మశాలీలు కుటుంబానికి ఒక్కరు చొప్పున సభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మామిడి పల్లి తర్ప మాజీ అధ్యక్షులు ఏడెల్లి శ్రీనివాస్, ఆర్మూర్ పద్మశాలి తర్ప-2 అధ్యక్షులు బండి అనంత్ రావు, పిప్రి పద్మశాలి సంఘం అధ్యక్షులు నందల లింబాద్రి, కొక్కుల మనోహర్, తిమ్మాపూర్ పద్మశాలి సంఘం చాట్ల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సిద్దుల గుట్టపై ధ్యాన ప్రచార కార్యక్రమం

నవతెలంగాణ-ఆర్మూర్



మాట్లాడుతున్న డైరెక్టర్

సుప్రసిద్ధ దేవస్థానం సిద్దులగుట్టపై శ్రీ నవనాథ సిద్దేశ్వర పిరమిడ్ ధ్యాన మహా శక్తి క్షేత్రం వద్ద ఆదివారం ధ్యాన కార్యక్రమం నిర్వహించారు. (పిరమిడ్ మెడిటేషన్ ఛానల్) డైరెక్టర్లు సేతు బాలకృష్ణ ,ఆనంద్ హైదరాబాద్ నుండి ముఖ్యఅతిథిలుగా విచ్చేసి ప్రసంగించారు. ప్రతి ఒక్క వ్యక్తి శాఖాహారం భుజిస్తూ ధ్యానం చేయాలని అన్నారు. ధ్యానం సర్వరోగ నివారిణి, ధ్యానం సత్య జ్ఞాన ప్రసాదిని, ధ్యానం సకల భోగ కారిని అని తెలిపారు. నవనాథపురం కమిటీ సభ్యులు అడ్వకేట్ సాయి కృష్ణారెడ్డి , తిరుమల గంగారాం, నల్ల గంగారెడ్డి , కూనింటిశేఖర్ రెడ్డి, అమృత రావు, సాయి బాబా, రాజారాం, నారాయణ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలి

- సిఐటియు డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

కాంట్రాక్టు ఏఎన్ఎంలను అందరిని రెగ్యులరైజ్ చేయాలి అని సిఐటియూ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఆరవ రోజు కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు నిజామాబాద్‌లోని ధర్నా చౌక్‌లో సమ్మెను కొనసాగించారు. ఈసందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఏ.రమేష్‌బాబు మాట్లాడుతూ.. ఈనెల 15 నుండి రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు సమ్మె కొనసాగిస్తుంటే ప్రభుత్వం స్పందించకపోవడం సరైనది కాదని అన్నారు. ఉమ్మడి రాష్ట్రం లో తెలంగాణ ఏర్పాటుకోసం పోరాటం సందర్భంగా అప్పటి ఉద్యమ నాయకుడు నేటి ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేసి అందర్నీ రెగ్యులరైజ్ చేస్తామని హామీనిచ్చారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పది సంవత్సరాలు అవుతున్నప్పటికీ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయకపోవడం సరైనది కాదని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని అనేకమార్లు కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు ప్రభుత్వానికి వినతి పత్రాలు ఇచ్చి మొరపెట్టుకున్నప్పటికీ పట్టించుకోకుండా ఖాళీలను భర్తీ చేయటానికి రాత పరీక్షలు నిర్వహించటంకోసం నోటిఫికేషన్ జారీ చేయటంతో ఉద్యోగుల్లో ఆందోళన ప్రారంభమైందన్నారు. తమ రెగ్యులరైజేషన్ కొరకు వెంటనే చర్యలు చేపట్టాలని రిటర్న్ టెస్ట్ రద్దు చేయాలన్నారు. ప్రభుత్వం మొండి పట్టుదలకు పోకుండా కాంట్రాక్ట్ ఏఎన్ఎంల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు ఈ సందర్భంగా కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ తమ నిరసనను వెలిబుచ్చడం జరిగింది. కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు పుష్ప, కవిత, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న ఏఎన్ఎంలు

మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు

- కమ్యూనిటీ పోలీసింగ్‌లో ఏఎస్సై శంకర్



అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ శంకర్

నవతెలంగాణ-బాల్కొండ

బాల్కొండ మండల పరిధిలోని కిసాన్‌నగర్, చిట్టాపూర్ గ్రామాల్లో ఆదివారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బాల్కొండ ఏఎస్సై శంకర్ కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్తులకు గంజాయి, గుట్కా, మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలు, ఆన్లైన్ మోసాలు, సైబర్ నేరాలు, సిసి కెమెరాల ప్రాముఖ్యతలపై అవగాహన కల్పించారు. వాహన దారులు వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ తప్పకుండా ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడపవద్దని అన్నారు. కార్యక్రమంలో పోలీస్ శాఖ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ జైవంత్రావు, కానిస్టేబుల్ నరేష్, సుమన్, తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీల అభివృద్ధి ఎమ్మెల్యే తోనే సాధ్యం

నవతెలంగాణ-ఆర్మూర్

మైనార్టీ అభివృధి ఎమ్మెల్యే జీవన్ రెడ్డి తోనే సాధ్యం అని కాంగ్రెస్ పార్టీ చేసింది ఏమి లేదని చేపూర్ సర్పంచ్ ఇందూరు సాయన్న అన్నారు.మండలంలోని చేపూర్ గ్రామంలో ఆదివారం మైనారిటీ కమిటీ హాల్ పనులు ప్రారంభం టెలికాం డైరెక్టర్ --షహద్ ముస్లిం మత పెద్దలు మర్కజ్ అధ్యక్షులు మొయినుద్దీన్ చేపూర్ మర్కజ్ అధ్యక్షులు షహాద్‌లు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి మండలానికి మూడు, నాలుగు ఊర్లలో పనులు ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మైనారిటీ లకు ఎల్లపుడు అండగా ఉంటూ గ్రామానికి ముస్లిం కమ్యూనిటీ హాల్ 5 లక్షలు మంజూరు చేసిన జీవన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఏకగ్రీవంగా ఆయనకే మద్దతు ఇస్తామని అన్నారు. పట్టణంలో మైనారిటీ ఫంక్షన్ హాల్ పనులు కోటి రూపాయలతో జరుగుతున్నాయని, అలాగే నందిపేట లోకూడా షాదీఖానా పూర్తి అయిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కేవలం ఓటు రాజకీయాల కోసం ముస్లింపై అనుకూలంగా మాట్లాటం తప్ప ముస్లింలకు చేసింది ఎం లేదని అన్నారు. కార్యక్రమంలో ముస్లిం అధ్యక్షులు రాజుల్లాహ్ ఖాన్, యూత్ నాయకులు అమీర్ అంజుమ్, మంజూరు కలీం ఖాలెద్ ఫహద్, అదిల్ సుమేరు, అమీర్, సద్దాం అజర్, తదితరులు పాల్గొన్నారు.



హాల్ పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

మండలంలో 29.6 మిల్లీమీటర్ల వర్షపాతం

- పలుచోట్ల నీటిలోనే సోయా పంట



నీటిలోనే ఉన్న సోయాపంట

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలో శనివారం ఉదయం నుండి ఆదివారం ఉదయం వరకు 29.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. శనివారం రాత్రి కూడా ఓ మోస్తారు భారీ వర్షం కురిసింది. రెండు రోజులు కురిసిన వర్షానికి పలు పంటలు నీట మునిగిన సంగతి తెలిసిందే. మండలంలోని పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లో ఉన్న సోయా, వరి, పసుపు పంటలు ఇప్పటికీ ఇంకా నీటిలోనే ఉన్నాయి. వర్షాలు ఇలాగే కురిస్తే పంటలకు తెగులు సోకే ఆస్కారం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట చేలల్లో నిలిచిన నీటిని బయటకు పంపేందుకు రైతులు ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా ఆదివారం ఉదయం నుండి వరణుడు కరుణించడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

చెక్ డ్యామ్‌ల నిర్మాణాలకు రూ.18 కోట్లు మంజూరు

- పెరగనున్న భూగర్భ జలాలు
- ఆర్టీసీ చైర్మన్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో 7 చెక్ డ్యామ్‌ల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.18 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మోపాల్ మండలంలోని తానాకుర్దు వద్ద చెక్ డ్యామ్ నిర్మాణం కోసం రూ.3.57 లక్షలు, నిజామాబాద్ రూరల్ మండలం కేశాపూర్‌కు రూ.2.58 లక్షలు, సిరికొండ మండలం తూంపల్లి కి రూ.68లక్షలు, గడ్కోల్‌కు 2.46,50 కోట్లు, డిచ్‌పల్లి మండలం రాంపూర్‌కు రూ. 3.05 కోట్లు, ఇందల్వాయి మండలం గౌరారం వద్ద చెక్ డ్యామ్ కోసం రూ.2.55 కోట్లు, నల్లవెల్లికి రూ.3.50 కోట్లు మొత్తం రూ.17.90కోట్లు నిధులు మంజూరైనట్లు ఆయన తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ రాకముందుగానే టెండర్ ప్రక్రియ పూర్తి చేసి చెక్ డ్యామ్ ల నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. చెక్ డ్యామ్ల నిర్మాణం పూర్తయితే ఆయా వాగుల్లో నీరు నిల్వ ఉండి భూగర్భజలాలు పెరుగుతాయన్నారు. తద్వారా సమీపంలోని గ్రామాల్లో పంటల సాగుకు ఎండా కాలంలో కూడా ఎలాంటి ఢోకా ఉండబోదన్నారు. అడిగిన వెంటనే నిధులు మంజూరు చేసిన సీఎం కేసీఆర్ కు ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ నియోజకవర్గ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు.



మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్

నేడు హసకొత్తూర్‌లో సంత ప్రారంభం



సంత ఏర్పాటు చేయనున్న స్థలం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని హసకొత్తూర్ గ్రామంలో సోమవారం సంత ప్రారంభిస్తున్నట్లు సర్పంచ్ ఏనుగు పద్మ రాజేశ్వర్, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.గ్రామంలోని రథం గుడి, కూరగాయల మార్కెట్ చుట్టూ సాయంత్రం 4గంటల నుండి వారాంతపు సంత (అంగడి) నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వారాంతపు సంతలో అన్ని రకాల వర్తక వ్యాపారులు పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. వారాంతపు సంతను పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంత నిర్వహణ కోసం గ్రామ పంచాయతీ, స్థానిక గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

కాపు కాసి వెనక్కి పంపి

- టోల్ ప్లాజా వద్ద డికే అరుణ,
- దర్మపురి అర్వింద్‌ను అడ్డుకున్న పోలీసులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

పోలీసులకు ముందస్తుగా ఉన్న సమాచారం మేరకు ఉదయం నుండి టోల్ ప్లాజా వద్ద కాపు కాసి వెనక్కి పంపడంలో పోలీసులు సఫలి కృతమయ్యారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో మాస్టర్ ప్లాన్ ను రద్దు చేయాలని మాజీ ఎమ్మెల్సీ మహేశ్వర్ రెడ్డి చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష 5వ రోజుకు చేరుకుంది. ఈ దీక్షకు సంఘీభావం తెలపడానికి వెలుతున్న బిజేపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికే అరుణను డిచ్ పల్లి సిఐ కృష్ణ అధ్వర్యంలో పోలీసులు ముందు కు వేళ్ళ కుండా ఆపేశారు. కొద్ది సేపటికే అదే రహదరి వెంట జగిత్యాల జిల్లా కోర్టుకు వెలుతున్న నిజామాబాద్ ఎంపి ధర్మపురి అర్వింద్ కాన్వాయ్‌ను సైతం టోల్ ప్లాజా వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో టోల్ ప్లాజా వద్ద కొద్ది సేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ముందుగా ఎంపీ ధర్మపురి అర్వింద్‌ను పంపించి వేశారు. జిల్లా ఎస్పీతో మాట్లాడిన తరువాత డికె అరుణను పోలీసులు వెనుకాముందు ఎస్కార్ట్‌తో నిర్మల్ కు తీసుకుని వెళ్ళారు. కాని శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా నిర్మల్ వరకు వెళ్లకుండ సోన్ వద్దనే నిర్మల్ పోలీసులు అదే వాహనంలో హైదరాబాద్‌కు తిరిగి పంపించారు. అంతకు ముందు ఎంపి ధర్మపురి అర్వింద్‌ను సైతం పోలీసులు అడ్డుకోవడంతో అదే సమయంలో బిజెపి కార్యకర్తలు విషయం తెలుసుకుని టోల్ ప్లాజా వద్దకు చేరుకున్నారు. ఇరువురిని పంపించడంతో పరిస్థితులు సద్దుమణిగాయి. ఉదయం నుండే పోలీసులు భారీ ఎత్తున మోహరించారు. సిఐ కృష్ణ తోపాటు ఇందల్ వాయి ఎస్ఐ సిలివేరి మహేష్ పోలీసులు ఉన్నారు.



డీకే. అరుణ, ఎంపీని అడ్డుకున్న పోలీసులు